సాక్షి జోగులాంబ గద్వాల

బుధవారం, 27, నవంబర్, 2024



రాజ్యాంగ విలువలు కాపాడాలి

రాజ్యాంగ విలువలు కాపాడాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు.

వివరాలు 8లో ▸



అద్దె చెల్లించడం లేదని..

అద్దె చెల్లించలేదని అమరచింత ఎంపీడీఓ ఆఫీస్‌కు ఇంటి యజమాని తాళం వేశారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.7 /15.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రంగా ఉండటంతో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

గద్వాల అర్బన్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారిణి ప్రియాంక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలతో పాటు ఐటీఐ, ఎలక్ట్రీషియన్ ఇతర కోర్సుల్లో శిక్షణ పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 63034 30789 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

రేపు కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

గద్వాలటౌన్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న స్థానిక ఇండోర్ స్టేడియంలో సీనియర్ కబడ్డీ జిల్లా మహిళా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా చైర్‌పర్సన్ డీకే స్నిగ్ధారెడ్డి, కన్వీనర్ అబ్రహాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 కేజీలోపు బరువు ఉన్న మహిళా క్రీడాకారులు జట్టు ఎంపిక పోటీలకు అర్హులని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 7నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఆసక్తి గల మహిళా క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు.

వేరుశనగ క్వింటా రూ. 6,981

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 444 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. క్వింటాల్ గరిష్టంగా రూ. 6,981, కనిష్టంగా రూ. 3,891, సరాసరి రూ. 4,990 ధరలు పలికాయి. 47 క్వింటాళ్ల ఆముదాలు రాగా.. గరిష్టంగా రూ. 5,679, కనిష్టంగా రూ. 5,019, సరాసరి రూ. 5,609 ధరలు లభించాయి. 2,425 క్వింటాళ్ల వరి (సోన) అమ్మకానికి రాగా.. గరిష్టంగా రూ. 2,695, కనిష్టంగా రూ. 1,709, సరాసరి రూ. 2,489 ధరలు వచ్చాయి.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

అలంపూర్: భారత రాజ్యాంగం ఆదేశిక సూత్రాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, నియోజకవర్గ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మిథున్‌తేజ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ విద్య భవిష్యత్‌కు పునాది వేస్తుందన్నారు. రాజ్యాంగం ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ, సమానత్వం కల్పించిందన్నారు. ఇంటర్ విద్య భవిష్యత్‌కు పునాది వేస్తుందని.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ న్యాయమూర్తిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్, న్యాయవాదులు రాజేశ్వరి, తిమ్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, యూదుర్ బాషా, కిషన్ రావు, కరుణాకర్ రావు, వెంకటేష్, మధు, ఉమాపతి, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

అయ్యో.. ఇదేం తిరకాసు!

ఫిర్యాదుతో నిలిచిన శునకాల తరలింపు

- జిల్లా కేంద్రంలో కుక్కల స్వైరవిహారం
- కొన్ని రోజులుగా పెరిగిన దాడులు
- ప్రజల విజ్ఞప్తి మేరకు పట్టివేతకు చర్యలు
- జంతు ప్రేమికుల ఫిర్యాదుతో నిలిచిన ప్రక్రియ



జిల్లా కేంద్రంలో కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది (ఫైల్)

గద్వాలటౌన్: ప్రజా సంక్షేమమా.. నిబంధనలా.. ఏది తేల్చుకోలేని స్థితిలో పడిపోయారు గద్వాల మున్సిపల్ అధికారులు. ప్రజలపై దాడులు చేస్తున్నాయన్న కారణంతో జిల్లా కేంద్రంలో కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు ప్రారంభించారు. అయితే ఇది జంతువుల హక్కులను కాలరాయడమేనంటూ జంతు ప్రేమికులు చేసిన ఫిర్యాదు వీరి చర్యలకు అడ్డుపడింది. దీంతో కొన్ని రోజులపాటు సాగిన కుక్కల తరలింపు ప్రక్రియ ఇప్పుడు నిలిచిపోయింది.

నిపుణులను రప్పించి..

కుక్కలను పట్టుకోవడం.. వాటిని జాగ్రత్తగా దూర ప్రాంతాలకు తరలించడం అంత సులభమైన పని కాదు. ఏమాత్రం అనుమానం వచ్చినా శునకాలు తప్పించుకుంటాయి. అందుకే నిపుణుల ద్వారా వాటిని తరలించే ప్రయత్నం చేస్తుంటారు. గద్వాల మున్సిపల్ అధికారులు సైతం రాజమండ్రి నుంచి పలువురు సిబ్బందిని రప్పించారు. స్థానికంగా వారికి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. పట్టణం నుంచి తరలించిన శునకాల సంఖ్య ఆధారంగా వారికి డబ్బులు చెల్లించాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఈ బృందం.. తమ పని ప్రారంభించారు. ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేసుకుని కాలనీలకు వెళ్లి కుక్కలను పట్టుకోవడం మొదలుపెట్టారు. ఇలా పట్టుకున్న కొన్ని కుక్కలను నల్లమల అటవీ ప్రాంతంలో క్షేమంగా వదిలేశారు. కొద్ది రోజుల్లోనే సమస్య పరిష్కారమవుతుందని పట్టణవాసులు భావించారు. కానీ అనూహ్యంగా అది మధ్యలోనే నిలిచిపోయింది.

ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో..

స్వేచ్ఛగా తిరిగేందుకు, జీవించేందుకు జంతువులకు సైతం హక్కులుంటాయని జంతు ప్రేమికుల వాదన. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్న కారణంతో కుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాల్లో వదిలేయడం వల్ల అవి తగిన ఆహారం, నీరు దొరక్క చనిపోయే ప్రమాదముందని.. ఇది వాటి హక్కులకు భంగం కలిగించడమేనన్న భావన వ్యక్తం చేశారు. ఈ కారణంతోనే మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో, వారి సూచనల మేరకు గద్వాల పట్టణంలో కుక్కల తరలింపు ప్రక్రియ ఆపేశారు. విషయం తెలుసుకున్న స్థానికుల్లో విస్మయం వ్యక్తమవుతోంది. మనుషుల ప్రాణాల మీదకు వచ్చేలా పరిస్థితి తీవ్రత ఉన్న సమయంలో.. ఇలా జంతు సంరక్షణ పేరిట ఆటంకం కలిగించడం సబబేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

వీధి కుక్కలను నియంత్రించాలి..



వీధి కుక్కలను నియంత్రించే బాధ్యత మున్సిపాలిటీపై ఉన్నా.. ఆ దిశగా అధికారులు కృషి చేయడం లేదు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఫలితంగా కుక్కల స్వైర విహారం చేసి గాయపరుస్తున్నాయి. మరికొంత మంది వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కుక్కల నియంత్రణకు తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీధర్‌గౌడ్, చిన్న అగ్రహారం

తరలింపు నిలిపివేశాం..



హైదరాబాద్‌కు చెందిన జంతు సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది. వారి సూచనల మేరకు కుక్కల తరలింపు ప్రక్రియను నిలిపివేశాం. స్థానిక పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– బీఎస్ కేశవ్, మున్సిపల్ చైర్మన్, గద్వాల

పెరిగిన దాడులు..

వీధి కుక్కల స్వైరవిహారంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొన్ని రోజులుగా పిచ్చికుక్కల బెడద ఎక్కువ కావడం మరింత కలవరానికి గురిచేస్తోంది. ఇటీవల ప్రధాన రహదారులపై వెళ్లే పలువురు వాహనదారులపై కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. వీరితో పాటు శ్రీనివాసకాలనీ, పాత హౌసింగ్‌బోర్డు కాలనీ, హమాలీ కాలనీ, నల్లకుంట, సుంకులమ్మమెట్టు, ఓంటిలపేట, బీసీ కాలనీ, రాఘవేంద్ర కాలనీ తదితర కాలనీల్లో కుక్కల దాడులతో పలువురు గాయపడ్డారు. పిల్లలు, పెద్దలు తేడాలేకుండా తీవ్రంగా గాయపడి ప్రైవేటు, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్సలు పొందారు. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు.

- ఇటీవల హమాలీ కాలనీలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న ఏడాది వయసు ఉన్న చిన్నారి అశ్వితపై ఓ కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. మరో బాలుడు సైతం కుక్క దాడిలో గాయపడ్డాడు. వారం రోజుల క్రితం హోటల్‌లో పనిచేసే ఓ వ్యక్తి తన పనులను ముగించుకొని ఇంటికి సైకిల్‌పై వెళ్తుండగా.. కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. ఇలా వరుస ఘటనలు చోటు చేసుకుంటుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కలను నియంత్రించి, ప్రజలకు రక్షణ కల్పించాలని పలు కాలనీల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు అందుతున్నాయి.



ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి అశ్విత

స్వరాష్ట్ర కల సాకారానికి పునాది.. కేసీఆర్ దీక్ష

గద్వాల అర్బన్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009 నవంబర్ 29న నిరహార దీక్ష ప్రారంభించారని.. ఇది స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్సీ, దీక్షా దివాస్ జిల్లా ఇన్‌చార్జి కర్నె ప్రభాకర్ అన్నారు. మంగళవారం అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడుతో కలిసి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సమాజాన్ని ఏకం చేసిన కేసీఆర్ దీక్షను గుర్తు చేసుకుంటూ, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ నెల 29న జిల్లా కేంద్రంలో దీక్షా దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కురువ విజయ్‌కుమార్, అతిఖుర్ రహ్మాన్, పటేల్ విష్ణువర్ధన్, కుర్వ పల్లయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న దీక్షా దివాస్ జిల్లా ఇన్‌చార్జి కర్నె ప్రభాకర్

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

అలంపూర్: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతంగా రాణించాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి హృదయరాజు అన్నారు. అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వందేమాతరం ఫౌండేషన్, వివేకానంద యూత్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో లావోటి ట్రస్ట్ ద్వారా విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. వివిధ గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థినుల సౌకర్యార్థం సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్ కుమార్, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు పోలీస్ చిన్నయ్య, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు రజిని పాల్గొన్నారు.

పండుగలా రైతు సదస్సు

అమిస్తాపూర్‌లో 3 రోజుల పాటు నిర్వహణ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు

- రేపు ప్రారంభించనున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వస్తున్న మార్పులపై వీడియో ప్రదర్శనలు
- ఆదర్శ రైతుల ప్రసంగాలు, నూతన విధానాలపై వివరణలు
- 28న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా.. 29న జిల్లాయేతర అన్నదాతలకు అవకాశం
- 30న రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్ష మంది వస్తారని అంచనా
- ఇదే రోజు సాయంత్రం బహిరంగ సభ.. హాజరుకానున్న సీఎం రేవంత్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు సదస్సుకు సన్నాహాలు మొదలయ్యాయి. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ మైదానంలో మూడు రోజుల పాటు పండుగలా నిర్వహించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ నెల 28న తొలి రోజు ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి సదస్సును లాంఛనంగా ప్రారంభించనున్నారు. చివరి రోజు 30వ తేదీన సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు తదితర మంత్రులు హాజరుకానున్నారు. ప్రదర్శనలు, స్టాళ్లను తిలకించిన అనంతరం సాయంత్రం నిర్వహించనున్న బహిరంగసభలో సీఎం ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతులకు చేకూరిన ప్రయోజనాలు, వ్యవసాయ, అనుబంధ పాడి, మత్స్య తదితర రంగాల్లో వస్తున్న ఆధునిక మార్పులు, విధానాలపై 150 వరకు వీడియో ప్రదర్శనలతో పాటు ఆదర్శ రైతుల ప్రసంగాలకు రైతు సదస్సులో పెద్దపీట వేశారు.

28, 29వ తేదీల్లో 5వేల మంది చొప్పున..

తొలిరోజు 28న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రైతులు సదస్సుకు హాజరై ప్రదర్శనలు వీక్షించేలా అవకాశం కల్పించారు. 29వ తేదీన ఇతర జిల్లాల్లోని రైతులు హాజరుకానున్నారు. రోజుకు సుమారు ఐదు వేల మంది చొప్పున రెండు రోజులు కలిపి పది వేల మంది వస్తారని అధికారులు అంచనా వేశారు. 30వ తేదీన రైతు సదస్సుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు లక్ష మంది వరకు వస్తారనే అంచనా మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

560 రైతు వేదికల ద్వారా లైవ్..

మూడు రోజుల పాటు జరిగే రైతు సదస్సులో ఆధునిక వ్యవసాయ యంత్ర సామగ్రి, వివిధ రకాల పంట రైతులు, హైబ్రిడ్ వంగడాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై రైతులకు అవగాహన కల్పించేలా సంబంధిత శాఖల ఆధ్వర్యంలో పలు స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు మూడు రోజుల కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా రైతులు వీక్షించేలా 560 రైతు వేదికల ద్వారా లైవ్ ప్రసారం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా సదస్సుకు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగునీటి సదుపాయం తదితర ఏర్పాట్లపై ఆయా శాఖలు కసరత్తు చేపట్టాయి.

విజయవంతం చేయాలి: మంత్రి తుమ్మల

మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు సదస్సు విజయవంతానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం వారు ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, కలెక్టర్లు, ఎస్పీలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఈ సంవత్సరకాలంలో రాష్ట్ర ప్రభుత్వం మరే రంగానికి లేని విధంగా వ్యవసాయానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించిందని చెప్పారు. ముఖ్యంగా రైతు రుణమాఫీతో రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం 20 వేల మంది నుంచి 30 వేల మంది రైతులకు లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. రైతులకు పెద్ద ఎత్తున చేకూరిన ఈ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలతో పాటు వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, ఆదర్శ రైతుల ప్రసంగాలు రైతు సదస్సులో ప్రధాన అంశాలుగా ఉంటాయని తెలిపారు. ఒక్కో పంటకు సంబంధించి ఒక్కో ఆదర్శ రైతు తమ అనుభవాలను ఈ సదస్సులో వివరిస్తారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సదస్సులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాల పార్కింగ్, స్టాళ్ల ఏర్పాటు, రైతులకు అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీహరి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ, సహకారశాఖ కార్యదర్శి రఘునందన్, ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హరీశ్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలుపాల్గొన్నారు.

అసలేం జరుగుతోంది..?

మాగనూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మళ్లీ వికటించిన మధ్యాహ్న భోజనం

- కొత్త బియ్యంతో భోజనం తయారు చేసినా అస్వస్థతకు గురైన విద్యార్థులు
- మళ్లీ శాంపిల్స్ సేకరణ
- విద్యార్థుల చిరుతిళ్లపై అనుమానాలు
- బేకరీలు, దుకాణాల్లో విచారించిన పోలీసులు



అస్వస్థతకు గురైన కూతురిని ఓదారుస్తున్న తల్లి



కారులో అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు



మాగనూర్ పీహెచ్‌సీలో కన్నీరు పెడుతున్న విద్యార్థులు

నారాయణపేట/మాగనూర్: జిల్లాలోని మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం మళ్లీ వికటించింది. మంగళవారం మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనతో జిల్లా అధికార యంత్రాంగం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. వారం రోజుల్లోనే రెండుసార్లు మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురికావడం.. మరోసారి పురుగులతో కూడిన అన్నం వడ్డించడంతో ఆ పాఠశాలలో అసలేం జరుగుతోందన్న చర్చ సాగుతోంది. భోజనం తయారీకి వినియోగించే బియ్యం, పప్పు, కూరగాయాల్లో నాణ్యతా లోపమా.. లేక వంటకు వాడే మంచినీళ్లు, వంట సామగ్రిలోనా.. అధికారుల అలసత్వమా.. వంట నిర్వాహకుల నిర్లక్ష్యమా.. విద్యార్థుల దురదృష్టమా అంటూ అందరిలోనూ అంతుచిక్కని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వంట ఏజెన్సీ నిర్వాహకులను మార్చిన రోజే మళ్లీ మధ్యాహ్న భోజనం వికటించడంపై అధికారుల్లో అయోమయం నెలకొంది.

రంగంలోకి పోలీసులు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. ఎస్పీ యోగేష్ గౌతమ్ దిశానిర్దేశంతో డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో ఎస్‌బీ సీఐ రాంలాల్, పోలీసు అధికారులు, సిబ్బంది మాగనూర్ పట్టణంలోని పలు బేకరీలు, దుకాణాల్లో విచారణ చేపట్టారు. విద్యార్థులు ఎవరైనా దుకాణాలకు వచ్చి తినుబండారాలు ఏమైనా తీసుకెళ్లారా? వస్తే ఎవరెవరూ వచ్చారు? వారిని గుర్తు పట్టగలరా అంటూ విచారించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి డీఎస్పీ విచారించారు. అయితే తమకు పాఠశాలలోనే బియ్యం ఇచ్చారని.. కూరగాయలను తెచ్చి అధికారుల కళ్లెదుటే బాగా కడిగి వంట చేశామని పేర్కొన్నారు. అధికారులు ఓకే అన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించామని చెప్పుకొచ్చారు.

మళ్లీ శాంపిల్స్ సేకరణ..

గత బుధవారం విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురికావడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ నేతృత్వంలో పప్పు, బియ్యం, కూరగాయలకు సంబంధించి శాంపిల్స్ సేకరించి.. హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ఆ శాంపిల్స్‌కు సంబంధించి ఇంకా రిపోర్టు రాకముందే.. విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని మళ్లీ అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటనతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనానికి వినియోగించిన వస్తువులతో పాఠశాలకు అందించే మిషన్ భగీరథ వాటర్ శాంపిల్స్ సేకరించారు.

- పాఠశాలలో ఇది వరకు ఉన్న వంట ఏజెన్సీ నిర్వాహకులను గత బుధవారం తొలగించిన విషయం పాఠకులకు విదితమే. గురువారం నుంచి సోమవారం వరకు మాగనూర్‌లోని వసతిగృహంలో వంట కార్మికులతో పాటు ఓ ప్రైవేటు వ్యక్తితో వంట వండించారు. అధికారులు రుచి చూసి పరీక్షించిన తర్వాత విద్యార్థులకు వడ్డించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులను మార్చి కొత్త వారికి అవకాశం కల్పించారు. అధికారుల పర్యవేక్షణలో పాత బియ్యం మార్చి కొత్త బియ్యం తెచ్చి వండించారు. అయితే విద్యార్థులు మళ్లీ అస్వస్థతకు గురికావడం అయోమయానికి గురిచేసినట్లు అయింది.

కలెక్టర్ ఆరా..

మాగనూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించిన ఘటనపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆరా తీస్తున్నారు. విద్యాశాఖ, రెవెన్యూ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. 22 మంది విద్యార్థులు వివిధ బేకరీలు, దుకాణాలలో తినుబండారాలు కొనుక్కుని తిన్నారని.. ఆ తర్వాత మధ్యాహ్న భోజనం తినడంతో వారు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తుందని కలెక్టర్ చెప్పుకొస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు అస్వస్థతకు గురి కాలేదని అధికారుల విచారణలో తెలిసిందని స్పష్టం చేశారు. పాత బియ్యం బస్తాలన్నీ మార్చేసినట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు, అన్ని శాఖల అధికారులు పాఠశాలల్లో తనిఖీ నిర్వహించి, ఆహార పదార్థాల స్టాకులను ధ్రువీకరించారని తెలిపారు.

- మాగనూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో పాటు తహసీల్దార్, ఇన్‌చార్జి హెచ్‌ఎం, పలువురు అధికారులు తిన్నారు. వారెవరూ అస్వస్థతకు గురికాలేదు. దాదాపు 400 మంది మధ్యాహ్న భోజనం చేయగా.. 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఎక్కడా తప్పిదం జరుగుతుందో అంతుచిక్కక అటు అధికారులు, ఇటు పాలకులు తలలుపట్టుకుంటున్నారు.

గ్రామాల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సృజన

ఇటిక్యాల/ఎర్రవల్లి: గ్రామాల్లో స్వయం ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సృజన అన్నారు. మంగళవారం ఇటిక్యాల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని ప్రతి గ్రామంలో సభలు నిర్వహించి, ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు, ప్రజలకు అవసరమైన పనులను అన్ని శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు వివరించారు. వర్మీ కంపోస్టు, ఇంకుడు గుంతలు, పొలం బాటలు, పశువుల కొట్టాలు వంటి అనేక ఉపయోగకరమైన పనులను చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితిని తగ్గించి, గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అంతకుముందు ఉపాధి హామీ పథకంలో పశువుల కొట్టం ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వర్మీ కాంపోస్టు తయారీ గుంతను ప్రారంభించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత సంవిధానం ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో నిత్యం ప్రజలకు సేవలందిస్తున్న పలువురు మల్టీ పర్పస్ వర్కర్లను అభినందించి ఘనంగా సత్కరించారు. అదే విధంగా బీచుపల్లి అభయాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు, జెడ్పీ సీఈఓ కాంతమ్మ, డీపీఓ శ్యాంసుందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఎంపీడీఓ అజర్ మొహిముద్దీన్, పీఆర్ ఈఈ దామోదర్ రావు, ఏపీఓ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


నారాయణ (ఫైల్)

హన్వాడ: తుకానికి కరియట కట్టి అంచులు తీస్తున్న సమయంలో స్టార్టర్ డబ్బా నీళ్లల్లో పడి విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. మండలంలో వేపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. వేపూర్‌కి చెందిన నారాయణ(65) మంగళవారం తుకానికి కరిగట కట్టేందుకు వెళ్లాడు. అంచులు తీస్తున్న సమయంలో స్టార్టర్ డబ్బాకు ఉన్న కట్టెకు తగలింది. అది నీళ్లల్లో పడిపోయి డబ్బాతో రైతుకు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: మల్లెబోయిన్‌పల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు.సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్‌కు చెందిన కౌరమోని ఆంజనేయులు(53) పని నిమిత్తం జడ్చర్లకు వచ్చి మోపెడ్‌పై తిరిగి వెళ్తున్నాడు. బండిలో పెట్రోలు అయిపోవడంతో సమీప బంక్‌లో పెట్రోల్ తీసుకుని రోడ్డు దాటుతున్నాడు. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు వేగంగా ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మరణించాడు. మృతుడి కుమార్తె అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి


దుర్గాప్రసాద్ (ఫైల్)

లింగాల: మండలంలోని జీలుగుపల్లికి చెందిన దుర్గాప్రసాద్(20) అనే యువకుడు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 24న ఆదివారం తల్లిదండ్రులు మందలించారని దుర్గాప్రసాద్ క్షణికావేశానికి లోనై పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఏరి యా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

మరో మహిళ..

హన్వాడ: కడుపునొప్పితో బాధపడుతూ ఇటీవలే పురుగు మందు తాగిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని లింగనపల్లికి చెందిన మల్లెల గోవిందమ్మ(48) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఈనెల 12న తీవ్రమైన కడుపునొప్పి రావడంతో పురుగుమందు తాగింది. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

తండ్రిని హతమార్చిన కొడుకు

మక్తల్: తనతో తరుచుగా గొడవ పడుతున్నాడనే కోపంతో ఓ కొడుకు తండ్రిని రోకలిబండతో దాడి చేసి దారుణంగా హతమార్చాడు. మండలంలోని దాసర్‌దొడ్డిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. దాసర్‌దొడ్డి గ్రామానికి చెందిన రాములు(58) భార్య గతంలోనే మృతిచెందగా ముగ్గురు కుమారులు రామకృష్ణ, మల్లేష్, బద్రితోపాటు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అయితే రెండో కుమారుడు ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతుండటంతో తండ్రీకొడుకులు తరుచుగా గొడవపడేవారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి గ్రామంలో సర్కస్ చూడటానికి పెద్ద కుమారుడు, చిన్నకుమారుడు వెళ్లగా.. రెండో కుమారుడు మల్లేష్ ఇంటికి వచ్చి తండ్రిని అన్నం పెట్టాలని కోరాడు. అయితే ఏ పనిచేయకుండా జులాయిగా తిరుగుతున్నావని తండ్రి మందలించడంతో కోపంతో ఇంట్లో ఉన్న రోకలిబండ తీసుకొని దాడి చేయడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై రాములు సోదరి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

స్వామియే శరణం 'అయ్యప్పా'!

ఉమ్మడి జిల్లాలో మార్మోగుతున్న అయ్యప్ప శరణుఘోష

- కఠిన నియమ, నిష్టలతో దీక్ష ఆచరణ
- క్రమంగా పెరుగుతున్న కన్యస్వాములు
- ప్రతి ఏటా 25వేల మంది వరకు దీక్షలో అయ్యప్ప మాలధారులు
- గ్రామాల్లో ఉట్టిపడుతున్న అయ్యప్ప భక్తి భావం


మూసాపేట్‌లో అయ్యప్ప దేవాలయం


పడిపూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు(ఫైల్)

గండేడ్: స్వామియే శరణం అయ్యప్పా.. అంటూ ఉమ్మడి జిల్లా అయ్యప్ప నామస్మరణతో మారుమోగుతుంది. శివమాల, హనుమాన్‌మాల, వెంకటేశ్వర మాల, షిరిడిసాయి మాల ఇలా రకరకాల మాలధారణతో పాటు అయ్యప్ప మాల ధారణ విశేష ఆదరణ పొందుతోంది. భజనల్లో, సేవల్లోనే కాదు మాలధారణలో కూడా మేము ముందే అంటున్నారు ఉమ్మడి పాలమూరు వాసులు.

కార్తీక మాసం నుంచి..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాలోని దేవరకద్ర, మక్తల్, నవాబ్‌పేట్, మూసాపేట్, గండేడ్, మహమ్మదాబాద్, హన్వాడా, కోస్గి, మరికల్, జడ్చర్ల,అచ్చంపేట, కల్వకుర్తి, కోయిల్‌కొండ తదితర ఆయా మండలాల్లో అయ్యప్ప దీక్షలు చేపడుతున్నారు. కార్తీకమాసం నుండి శబరిమలలో జ్యోతి దర్శనంతో పాటు అయ్యప్ప పడిపూజ వరకు కూడా స్వాములు మాల ధరించి నల్ల, నీలి, కాషాయ వస్త్రాల్లో దర్శనమిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతిఏటా 25 వేల మంది వరకు అయ్యప్పమాలలు వేసుకుంటున్నారు.

నియమావళిని పాటిస్తూ..

ప్రతిఏటా కన్యస్వాముల సంఖ్య పెరుగుతూ ఉంది. అయ్యప్ప మాల కఠినమైనది, ఖర్చు కూడ కున్నది అయినా కూడ దీక్షాపరుల సంఖ్య తగ్గడం లేదు. ఎముకలు కొరికే చలి ఉన్నా లెక్క చేయకుండా నియమావళిని పాటిస్తూ ఏటా కొత్తవారు దీక్ష స్వీకరిస్తున్నారు. ఒక్క మహమ్మదాబాద్ సన్నిదానంలో ఎప్పుడు కన్యస్వాములు 10 మందికి మించి ఉండేవారు కాదు. ఈఏడాది మాత్రం 30మంది వరకు కన్నెస్వాములు మాలవేశారు. 41 రోజుల దీక్షల అనంతరం ఇరుముడితో శబరిమల సన్నిధికి చేరుకుని అయ్యప్పను దర్శింకొంటున్నారు. కొందరు గురుస్వాములు ఏళ్ల తరబడి మాలలు వేసుకొని శబరిమలకు వెళ్తున్నారు. చాలా మంది స్వాములు పాదయాత్రగా శబరికి చేరుకుంటున్నారు.

'ఇంటింటా భజన.. మన ఇంట భజన' పేరుతో..

ఉమ్మడి జిల్లాల్లో ఆయా చోట్ల మాలధారణతో పాటు అయ్యప్ప ఆలయాలు నిర్మించి భక్తి పారవశ్యాన్ని పెంపొందిస్తున్నారు. దీక్షకు విస్తృత ప్రచారం కల్పించాలన్న ఉద్దేశ్యంతో మహబూబ్‌నగర్ అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఇంటింట భజన మన ఇంట్లో భజన కార్యక్రమం చేపట్టారు. గతేడాది ఉగాది రోజున మహబూబ్‌నగర్‌లో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి బుధవారం ఒకరి టికి వెళ్లి అయ్యప్ప పటం పూజ పెట్టి భజన చేసి వస్తారు. పేద వారు ఉంటే అన్ని ఖర్చులు ప్రచార సమితియే భరిస్తుంది. ఈ ర్యక్రమంలో భాగంగా తులసి మొక్క, ధ్వజం, భగవద్గీతలు ఇంటి యజమానికి అందజేస్తారు. దీంతో పాటు భజనకు వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి ప్రతినెల డ్రా తీసి గెలుపొందినవారికి రూ.1500 విలువ చేసే వెండి విగ్రహాన్ని ఇస్తారు.

ఇళ్లల్లో పడిపూజలు..

దీక్ష స్వీకరించిన స్వాములు తమతమ ఇళ్లల్లో పడిపూజలు నిర్వహిస్తారు. తమ కుటుంబాలు బాగుండాలని, కోరికలు నెరవేరాలని గురుస్వాముల ఆధ్వర్యంలో ఇళ్లల్లో పడివెలిగిస్తారు. పడిపూజల్లో తన్మయత్వంలో ఒకటవమెట్టు శరణం పున్నయ్యప్ప స్వామి పున్నయ్యప్పా అంటూ మొదటి మెట్టు నుండి పద్దెనిమిదవ మెట్టు వరకు పడి వెలిగించి పరవశించిపోతున్నారు. పడి వెలుగుల్లో స్వామి దింతనతోం .. అయ్యప్ప దింతనతోం అంటూ పేటతుల్లి ఆడుతున్నారు. ఈ ఘట్టం ప్రతి ఒక్కరిని రోమాలు నిక్కబొడిచేలా చేసి భక్తి పారవశ్యంలో ముంచెత్తుతుంది.

ఎన్నో ఏళ్లుగా కలలు కన్నా



మహమ్మదాబాద్ అయ్యప్ప ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నా. నిత్యం అయ్యప్పకు పూజలు చేయడమే తప్ప మాలధారణ సాధ్యం కాలేదు. మాలలో ఉన్న స్వాములకిచ్చే గౌరవం సాక్షాత్తూ అయ్యప్పగా పరిగణించడం నన్ను దీక్ష స్వీకరించేలా చేశాయి. ఏడాది ఎలాగైనా దీక్ష స్వీకరించాలన్న గట్టి సంకల్పంతో మాలధారణ చేశా.

– వినోద్, కన్యస్వామి, మహమ్మదాబాద్

పూర్వజన్మ సుకృతం



అయ్యప్ప దీక్ష స్వీకరించాలంటే పూర్వజన్మ సుకృతం. ఒక్కసారి దీక్ష చేపట్టిన వ్యక్తి తనవంట్లో సత్తువ ఉన్నంత వరకు శబరీశుడిని దర్శించుకుంటూనే ఉంటాడు. ప్రతి ఏటా దీక్షాపరుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఒకప్పుడు మహమ్మదాబాద్ సన్నిదానంలో పది మంది ఉండేవారు. నేడు అది వందకు దాటింది. అక్కడ పలువురు దాతల సహకారంతో ఆలయం నిర్మించారు.

– గొంద్యాల శ్రీనివాస్, గురుస్వామి, మహబూబ్‌నగర్.

భక్తిభావం పెంపొందుతుంది..



మాలధారణతో భక్తి భావం పెంపొందుతుంది. ప్రతిసారీ కార్తీకమాసం వచ్చిందంటే మాల వేయాల్సిందే. మాల వేయడం ఇది 32వ సారి. ఎన్ని అడ్డంకులొచ్చినా మాల వేయకుండా ఉండలేను. ఈదీక్ష ద్వారా భక్తిభావం, సేవాభావంతో సత్ప్రవర్తన అలవడుతోంది.

– రమేష్, గురుస్వామి, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ప్రధానకార్యదర్శి, మహబూబ్‌నగర్

సన్నిధానాల్లో నిత్యాన్నదానం

ఉమ్మడి జిల్లాల్లో ఆయా సన్నిధానాల్లో నిత్యాన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల మాలధారణ చేసిన స్వాములు తమస్వంత డబ్బులతో అన్నదాన సత్రాలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని చోట్ల దాతల సహకారంతో వేలాది మాలధారులకు అన్నదానం చేస్తున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్ అశోక్ టాకీస్ చౌరస్తాలో అమవాస్య అన్నదాన మంటపం ఏర్పాటు చేశారు. స్వాములకు ఉదయం, సాయంత్రం టీ, కాఫీలతో పాటు అల్పాహార వితరణ చేస్తున్నారు. మిగతా సమయాల్లో అమవాస్య రోజు 1000 మందికి అన్నదానం చేస్తారు. ఎండాకాలంలో చల్లని నీరు, మజ్జిగ కూడా మంటపం ద్వారా అందజేస్తారు.


మహమ్మదాబాద్‌లో బిక్ష చేస్తున్న స్వాములు (ఫైల్)

25 ఏళ్లుగా మాలధారణ చేస్తూ..



అయ్యప్ప దీక్షపై అవగాహన కల్పించడమే అఖిల భారత అయప్ప దీక్షా ప్రచార సమితి సంకల్పం. విస్తృత ప్రచారం చేసి ఎక్కువ సంఖ్యలో మాలధారణ చేసేలా కృషి చేస్తున్నాం. 25 ఏళ్లుగా మాలధారణ చేస్తూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడుతున్నాం. అమవాస్య అన్నదాన మంటపంతో పాటు పలుచోట్ల అన్నదాన సత్రాల నిర్వహణకు సహకరిస్తున్నాం.

– సీమ నరేందర్, గురుస్వామి, అఖిలభారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు

రామన్‌పాడులో 1,021అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 390క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 755 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్టీఆర్ కాలువ ద్వారా 920 క్యూసెక్కులు, కుడిఎడమ కాలువ ద్వారా 25 క్యూసెక్కులు వివిధలిఫ్టుల ద్వారా 712 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

ప్రైవేటు స్కూల్ వ్యాన్ బోల్తా

- పలువురికి స్వల్ప గాయాలు

మహమ్మదాబాద్: ఓ ప్రైవేటు స్కూల్ వ్యాను బోల్తా ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన వ్యాను మంగళవారం ఉదయం విద్యార్థులను తీసుకువచ్చేందుకు మంగంపేట తండాకు వెళ్లింది. పిల్లలను తీసుకుని తిరుగు ప్రయాణంలో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

బుక్‌కీపర్‌పై కేసు నమోదు

మహమ్మదాబాద్: బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను ప్రతినెలా చెల్లించిన డబ్బును బుక్‌కీపర్ వాడుకున్నాడు. మంగళవారం అతడిపై కేసు పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలు.. మండలంలోని కంచన్‌పల్లికి చెందిన రాజు పొదుపు సంఘాల్లో బుక్‌కీపర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగైదేళ్లుగా రుణాలు తీసుకున్న సంఘాలు ప్రతీ నెలా పొదుపు అసలు, వడ్డీ డబ్బులు బ్యాంక్‌లో వేయడానికి చెల్లిస్తున్నారు. రాజు ఆడబ్బులు బ్యాంకులో వేయకుండా వాడుకున్నాడు. పలుమార్లు అధికారులు వచ్చి హెచ్చ రించినా అతడు తిరిగి చెల్లించలేదు. దీంతో మంగళవారం ఏపీఎం సునీత, డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

బియ్యం లారీ బోల్తా

కోడేరు: మండలంలోని సింగోటం నుంచి కోడేరు మీదుగా రేవల్లి మండలం కొంకలపల్లికి 155 క్వింటాళ్ల బియ్యాన్ని తీసుకెళ్తుండగా ఎత్తం మాలవాగు దగ్గర లారీ మంగళవారం అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ కిందకు దూకడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు లారీ యజమాని తెలిపారు.

తల్లి బలవన్మరణం.. తండ్రి జైలుపాలు

- అనాథలుగా చిన్నారులు


మృతిచెందిన శ్రావణి (ఫైల్)


అనాథలుగా మారిన నిత్యశ్రీ, నిషీత్

ఆత్మకూర్: క్షణికావేశంలో ఆభార్య ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఆ ఘాతుకానికి భర్తే పాల్పడ్డాడంటూ భార్య కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదుతో భర్త కటకటాల పాలయ్యాడు. దీంతో వారి సంతానమైన కూతురు నిత్యశ్రీ (11), కుమారుడు నిషీత్(9) అనాథలుగా మారారు. ఈ హృదయ విదారకర ఘటనకు సంబంధించిన వివరాలు.. ఆత్మకూర్‌లోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న శ్రావణి(30) సోమవారం ఇంట్లో చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. విషయాన్ని భర్త పరశురాములు అత్తమామలకు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. శ్రావణిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. కాగా తమ కుమార్తె శ్రావణిని భర్త పరశురాములే హత మార్చాడని మృతురాలి తల్లిదండ్రులు తెలుగు పోషన్న, శివమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసి మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బుధవారం నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

తల్లి మృతి.. తండ్రి జైలు పాలు కావడంతో చిన్నారులు అనాథలుగా మారాడంతో స్థానికులు వారిని చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈసంఘటనపై సమగ్రమైన విచారణ జరపాలని సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

ట్రాక్టర్ మరమ్మతు చేస్తూ..

- ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు
- మృతుడు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు
- పోతులమడుగులో విషాదం


కరుణాకర్‌రెడ్డి (ఫైల్)

అడ్డాకుల: వ్యవసాయ పొలంలో కరిగెట చేస్తుండగా ఆగిపోయిన ట్రాక్టర్‌ను మరమ్మతు చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ పైనుంచి పోవడంతో బీఆర్ఎస్ నాయకుడు మృతిచెందిన సంఘటన పోతులమడుగులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మద్దూరి కరుణాకర్ రెడ్డి(49) వ్యవసాయం చేస్తుంటాడు. ఈక్రమంలో గ్రామానికి శివారులో ఉన్న తన సొంత పొలంలో ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్నాడు. సాంకేతిక సమస్యతో ట్రాక్టర్ కరిగెటలోనే ఆగిపోయింది. అదే గ్రామానికి చెందిన రమేష్ అనే మెకానిక్‌ను పిలిపించి ఇద్దరు కలిసి బాగు చేస్తున్నారు. కరుణాకర్‌రెడ్డి ట్రాక్టర్ కేజీ వీల్స్ ముందు నిలబడి తీగలను సరి చేస్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ స్టార్ట్ అయి ముందుకు దూసుకెళ్లింది. ట్రాక్టర్ కేజీ వీల్స్ ముందు కరిగెటలో నిలబడిన కరుణాకర్‌రెడ్డిపై ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న మెకానిక్ రమేష్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని సమీప పొలాల్లో ఉన్న రైతులు, గ్రామస్తులు కలిసి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. కరుణాకర్‌రెడ్డికి ఆస్పత్రిలో చికిత్స మొదలు పెట్టేలోనే ప్రాణాలు వదిలాడు. మెకానిక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కరుణాకర్‌రెడ్డికి భార్య పావని, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరితో సౌమ్యుడిగా పేరొందిన కరుణాకర్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యుల రోదనలు అందరిని కలచివేశాయి.

ఇసుక డంపు సీజ్

మరికల్: కోయిల్‌సాగర్ ఊకచెట్టు వాగులో అనుమతుల్లేకుండా భారీఎత్తున డంప్ చేసిన ఇసుకను అధికారులు మంగళవారం సీజ్ చేశారు. రూ.20లక్షల విలువ చేసే 60 టిప్పర్ల ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ జమీల్, ఆర్ఐ సుధాకార్‌రెడ్డి తెలిపారు. నెల రోజుల నుంచి ఊకచెట్టు వాగులో నుంచి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడుతో పాటు మరికొందరు అనుమతుల్లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల: మండలంలోని మాచారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. మాచారం గ్రామానికి చెందిన మేకల మల్లేష్ ఇంటికి తాళంవేసి పొలంలో పనులు చేసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో గుర్తు తెలియని ఇద్దరు దొంగలు ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలో దాచిన 3 తులాల పుస్తెల తాడుతో పాటు కమ్మలు, మ్యాట్లీలు, ఉంగరాలు, వెండి వస్తువులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

40గొర్రెలు అపహరణ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మాసయ్యకు చెందిన 40గొర్రెలను సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. వివరాలు.. మాసయ్య రోజువారీగా గొర్రెలను సోమవారం సాయంత్రం గొర్రెల షెడ్‌లో దాదాపుగా 200కు పైగా ఉంచాడు. రాత్రి 9గంటల వరకు గొర్రెల వద్ద ఉన్నాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లి నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో గొర్రెల మంద వద్దకు వచ్చి కొన్ని గొర్రెలు లేనట్లు గుర్తించాడు. సమీపంలోని వ్యవసాయ పొలంలో వెతికినా కనిపించలేదు. అక్కడ వాహనాల ఆనవాళ్లు లభించడంతో గొర్రెలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. మాసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుప్త నిధుల కోసం వేట

- పురాతన వినాయక విగ్రహం ధ్వంసం



కోడేరు: గుప్త నిధుల కోసం దుండగులు వేట కొనసాగించారు. పురాతన వినాయక విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల కేంద్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయం వెనక భాగంలో ప్రధాన రహదారి పక్కన పురాతన వినాయక విగ్రహం ఉండేది. అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో కర్నాటకకు చెందిన క్రూజర్ వాహనంలో కొందరు వచ్చి విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్నారు. అటుగా వెళ్తున్న ఓవ్యక్తి గమనించి కేకలు వేయడంతో దుండగులు వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఉదయం గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ గోకారి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు.

రాజ్యాంగ విలువలను కాపాడాలి


మాట్లాడుతున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

- వీసీ జీఎన్ శ్రీనివాస్
- పీయూలో రాజ్యాంగ దినోత్సవంపై సెమినార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కృషి చేయాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పీయూలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సెమినార్‌కి మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ప్రతి పౌరుడి హక్కులను కాపాడేందుకు రాజ్యాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రతి వ్యక్తి కూడా సమానత్వం, న్యాయం వంటి అంశాల్లో పూర్తి స్వేచ్ఛ ఉందని అన్నారు. రాజ్యాంగ రచనలో అంబేద్కర్ చూపిన స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

రాజ్యాంగం ముందు అందరూ సమానులే..

రాజ్యాంగం ముందు అందరూ సమానులేనని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే రాజ్యాంగాన్ని పూర్తిగా విశ్వసించాలని, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లుతుందదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, కంట్రోలర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు చంద్రకిరణ్, నూర్జహాన్, బషీర్‌అహ్మద్, కన్వీనర్ కుమారస్వామి, కో కన్వీనర్ భూమయ్య, విజయ భాస్కర్, సోమేశ్వర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడాలి


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ సాంబయ్య

ఎర్రవల్లి: ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని అనుసరించి దాని విలువలను కాపాడాలని పదవ పటాలం కమాండెంట్ సాంబయ్య అన్నారు. మంగళవారం బీచుపల్లి పదవ పటాలంలో భారత రాజ్యాంగ ప్రవేశిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాండెంట్ హాజరై అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం భారత ప్రభుత్వం ప్రవేశిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోందన్నారు. దేశ ప్రజలు కుల, మతాలకతీతంగా స్వేచ్ఛగా జీవించడానికి ఆధారం అంబేద్కర్ రచించిన రాజ్యాంగమేనని అన్నారు. అనంతరం పటాలం అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ఆర్ఐలు రాజారావు, ఆర్.పీ.సింగ్, వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా...


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ తదితరులు

ఆలయ భూముల్లో సోలార్ ప్లాంట్లు

దేవాదాయ మంత్రి కొండా సురేఖ వెల్లడి

పెద్దపల్లి రూరల్: దేవాదాయశాఖ భూముల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు స్థాపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలోని శ్రీకోదండ రామాలయ ఆవరణలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిపై విచారణ జరిపి స్వాధీనం చేసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఆ భూముల్లో మహిళా సంఘాలతో సౌరశక్తి ప్రాజెక్టులు ఏర్పాటు చేసి ఆదాయం పొందేలా చూస్తామని, మిగతా భూముల్లో ఆయిల్‌పాం సాగుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. వేములవాడ, యాదగిరిగుట్ట ఆలయాల అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని సురేఖ తెలిపారు. ఆలయ గోపురాలకు బంగారు తాపడాలు చేపట్టే పను లు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వేములవాడ ఆలయానికి వెండితో పల్లకీ తయారు చేయించే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

‘డబుల్’ కాలనీల్లో మౌలిక వసతులకు రూ.196.46 కోట్లు

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలను జనావాసాలకు వీలుగా మార్చేందుకు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ కాలనీల్లో చాలా చోట్ల కనీస వసతులు కూడా లేకపోవటంతో జనం ఉండే పరిస్థితి లేకుండా పోయింది. తాగునీరు, కరెంటు కనెక్షన్, రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల నిర్మాణం లాంటివి చేపట్టేందుకు వీలుగా రూ.196.46 కోట్ల మొత్తాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది.

‘రైల్వే’ కిల్లర్!

- ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లోని వికలాంగుల బోగీలో సంచారం
- 35 రోజుల్లో ఐదు రాష్ట్రాల్లో అత్యాచారాలు, హత్యలు
- నిందితుడిని పట్టుకున్న గుజరాత్‌లోని వల్సాడ్ కాప్స్
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒకటి చేసినట్లు అంగీకారం
- పీటీ వారెంట్‌పై ఇక్కడకు తీసుకురానున్న రైల్వే పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: అతడి పేరు భోలో కరమ్‌వీర్ జాట్ అలియాస్ రాహుల్.. స్వస్థలం హర్యానాలోని రోహ్తక్‌లో ఉన్న మోక్రా ఖాస్... గతంలో రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల్లో నేరాలు చేశాడు. ఇటీవల ‘రైల్వే’ కిల్లర్‌గా మారాడు. ఈ ఏడాది అక్టోబర్ 17 నుంచి ఆదివారం (ఈ నెల 24) మధ్య 35 రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో సంచరిస్తూ ఐదు రాష్ట్రాల్లో ఐదు మర్డర్లు చేశాడు. వీటిలో కొన్ని సొత్తు కోసమైతే.. మరి కొన్ని అత్యాచారం, హత్యలు. గుజరాత్‌లోని వల్సాడ్ పోలీసులు ఈ నరహంతకుడిని సోమవారం పట్టుకున్నారు. విచారణలో ఆఖరి ఘాతుకాన్ని ఆదివారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులకు వల్సాడ్ పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో పీటీ వారెంట్‌పై కరమ్‌వీర్‌ను నగరానికి తీసుకురావడానికి పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. వల్సాడ్ ఎస్పీ డాక్టర్ కరణ్‌రాజ్ సింగ్ వాఘేలాను మంగళవారం ‘సాక్షి’ ఫోన్ ద్వారా సంప్రదించింది. ఆయన ఈ సీరియల్ కిల్లర్ పూర్వాపరాలు వెల్లడించారు.

చిన్ననాటి నుంచి చిత్రమైన ప్రవర్తన..

హర్యానాలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రాహుల్‌కు ఎడమ కాలికి పోలియో సోకింది. ఫలితంగా చిన్నతనం నుంచి ఆటపాటలకు దూరంగా ఉంటూ ఒంటరిగా ఉండేవాడు. విపరీతమైన భావాలు, చిత్రమైన ప్రవర్తన కలిగి ఉండేవాడటంతో కుటుంబం దూరంగా పెట్టింది. ఐదో తరగతితో చదువుకు స్వస్తి చెప్పిన రాహుల్ లారీ క్లీనర్‌గా పని చేస్తూ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. అయితే పోలియో కారణంగా ఇతడికి ఎవరూ డ్రైవర్‌గా ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో హైవే దాబాలో కార్మికుడిగా మారిన రాహుల్... అక్కడ పార్క్ చేసి ఉన్న లారీలను తస్కరించడం మొదలెట్టాడు. దీంతో పాటు లూటీలు, కిడ్నాప్‌లకు పాల్పడ్డాడు. ఈ ఆరోపణలపై రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో 13 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే వరకు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైల్లో గడిపిన రాహుల్


కరమ్‌వీర్ జాట్

బెయిల్‌పై విడుదలయ్యాడు. అక్కడ నుంచి గుజరాత్‌లోని ఉద్వాడ పట్టణానికి చేరుకుని ఓ హోటల్‌లో కార్మికుడిగా చేరాడు. కొన్ని రోజులు పని చేసి వాపి ప్రాంతానికి చేరుకుని ఫుట్‌పాత్స్ పైన గడిపాడు.

ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేసుకుని..

వివిధ రైళ్లల్లో దివ్యాంగుల కోసం చివరలో ప్రత్యేక బోగీలు ఉంటాయి. వీటిలో ప్రయాణించే దివ్యాంగులను సాధారణంగా టీసీలు సైతం తనిఖీ చేయరు. పాసులు కలిగి ఉంటారనే ఉద్దేశంలోనే వదిలేస్తుంటారు. దీన్ని తనకు అనువుగా మార్చుకున్న రాహుల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లోని దివ్యాంగుల బోగీల్లో ఎక్కి దేశం మొత్తం తిరగడం ప్రారంభించాడు. ఈ ఏడాది జూన్ రెండో వారం నుంచి ఇలా దేశ సంచారం చేస్తున్న రాహుల్ అక్టోబర్ 17న తొలి హత్య చేశాడు. ఆ రోజు బెంగళూరు–మురుదేశ్వర్ రైలులో ప్రయాణిస్తుండగా బీడీ కాల్చడంపై తోటి ప్రయాణికుడు అభ్యంతరం చెప్పాడు. దీంతో విచక్షణకోల్పోయిన రాహుల్ గొంతు నులిమి చంపేశాడు. ఆపై అతడి వద్ద ఉన్న సొత్తు, సొమ్ము తీసుకుని రైలు దిగిపోయాడు. దీనిపై మంగుళూరులో ఉన్న ముల్కీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

వరుసపెట్టి మరో నాలుగు హత్యలు..

ఆపై కతిహార్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రాహుల్ పశ్చిమ బెంగాల్‌లోని హౌరా స్టేషన్‌లో మరో వృద్ధుడి గొంతు కోసి చంపి దోపిడీకి పాల్పడ్డాడు. పుణే–కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌లో మరో మహిళపై అత్యాచారం చేసి, కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. వీటిపై ఆయా ఠాణాలో కేసులు నమోదయ్యాయి. ఈ నెల 14న ఉద్వాడలో తాను పని చేసిన హోటల్‌కు వెళ్లి జీతం తీసుకోవాలని భావించాడు. అక్కడకు వచ్చిన రాహుల్‌కు స్టేషన్ ఫ్లాట్‌ఫామ్‌పై ఒంటరిగా సంచరిస్తున్న యువతి కనిపించింది. ఆమెను సమీపంలోని మామిడి తోటలోకి లాక్కెళ్లి, అత్యాచారం చేసి చంపేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న వల్సాడ్ పోలీసులు ఘటనాస్థలిలో లభించిన బ్యాగ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వివిధ రైల్వే స్టేషన్లలోని 2500 సీసీ కెమెరాల్లో ఫీడ్‌ను అధ్యయనం చేసి నిందితుడిని గుర్తించారు. ఉద్వాడ నుంచి రైలులో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం చేరుకున్న రాహుల్ అట్నుంచి షిర్డీ, ఆపై బాంద్రా చేరుకున్నాడు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మహిళ హత్య..

అక్కడ నుంచి సికింద్రాబాద్ వచ్చిన రాహుల్ ఆదివారం తెల్లవారుజామున రైలు దిగాడు. ఆ సమయంలో తొమ్మిదో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై మంగుళూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఆగి ఉంది. దాని సీట్ కమ్ లగేజ్ ర్యాక్ (ఎస్‌ఎల్‌ఆర్) కోచ్‌లో ఓ మహిళ ఒంటరిగా ఉండటం గమనించాడు. ఆమెను గొంతునులిమి చంపేసిన రాహుల్ నగదు, సెల్‌ఫోన్ తస్కరించాడు. అక్కడ నుంచి రైలులోనే ఉడాయించాడు. ఈ హత్యపై సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వివిధ రైళ్లు మారిన రాహుల్ బాంద్రా–భుజ్ ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం గుజరాత్‌లోని వాపి చేరుకున్నాడు. అప్పటికే ఇతడి కదలికలు సాంకేతికంగా గమనిస్తున్న వల్సాడ్ పోలీసులు అక్కడ వలపన్ని పట్టుకున్నారు. అతడి నుంచి సికింద్రాబాద్‌లో చంపిన మహిళ నుంచి తీసుకున్న సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతడి అరెస్టుపై సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు.


పరిశ్రమ భవనాన్ని అలుముకున్న దట్టమైన పొగలు

ఫ్యాబ్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

మంటలతో కుప్పకూలిన ఓ భవనం

- దట్టమైన పొగలతో పరిసరాలు భయానకం
- బయటికి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్న కార్మికులు
- ఘటనా స్థలికి 8 ఫైరింజిన్లు.. ఒక బ్రాంటోస్కైలిఫ్ట్
- అర్ధరాత్రి వరకూ అదుపులోకి రాని మంటలు
- పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా

జీడిమెట్ల: జీడిమెట్ల దూలపల్లి రోడ్డులోని ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల తాకిడికి పరిశ్రమలోని మూడు ఫ్లోర్లు దగ్ధమయ్యాయి. ఓ భవనం కుప్పకూలింది. అగ్నిప్రమాదం సంభవించగానే పరిశ్రమలోని కార్మికులంతా బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. పోలీసులు, స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఫేజ్–5 దూలపల్లి రోడ్డులో సిరాజుద్దీన్ అనే వ్యక్తి ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పేరిట ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేసే పరిశ్రమను నడుపుతున్నాడు. పరిశ్రమ గ్రౌండ్ ఫ్లోర్ సహా మరో రెండు ఫ్లోర్లు ఉండగా ఆపైన పెద్ద రేకుల షెడ్డు నిర్మించారు. పరిశ్రమలో మొత్తం 500 మంది కార్మికులు ఉండగా.. మంగళవారం జనరల్ షిఫ్ట్‌లో దాదాపు 200 మంది ఉన్నారు. మధ్యాహ్నం పరిశ్రమ మూడో అంతస్తులోని రేకుల షెడ్డులో కొంతమంది కార్మికులు ఆర్‌పీ (రీప్రాసెసింగ్) మెషీన్ వద్ద పనులు చేస్తున్నారు. 12.30 గంటల ప్రాంతంలో రేకుల షెడ్డులో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. కార్మికులు బతుకు జీవుడా అంటూ కిందకు పరుగులు తీశారు.

శ్రమించిన 50 మంది ఫైర్ సిబ్బంది..

సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున ప్లాస్టిక్ నిల్వలు ఉండటంతో భారీగా మంటలు అలుముకున్నాయి. ప్రమాద తీవ్రతను గమనించిన అగ్నిమాపక శాఖ అధికారి శేఖర్‌రెడ్డి ఉన్నతాధికారులకు వివరించడంతో 8 వాహనాలు పరిశ్రమ వద్దకు చేరుకున్నాయి. దాదాపు అయిదు ఫైర్ స్టేషన్‌ల నుంచి వచ్చిన 50 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. మూడో అంతస్తులోకి నీటిని చిమ్మడం కష్టంగా మారడంతో బ్రాంటోస్కైలిఫ్ట్‌ను తెప్పించారు. మంటలు అర్ధరాత్రి వరకు కూడా అదుపులోకి రాలేదు.

పైనుంచి కింది అంతస్తు వరకు వ్యాపించిన మంటలు..

పరిశ్రమ విశాలంగా ఉండటంతో పాటు లోపల పెద్ద ఎత్తున ప్లాస్టిక్ బ్యాగులు నిల్వ ఉన్నాయి. పైన ఆర్‌పీ యంత్రం వద్ద అంటుకున్న మంటలు ఒక్కో అంతస్తు నుంచి నేరుగా కింది అంతస్తు వరకు వ్యాపించాయి. పరిశ్రమ భవనం మంటల తాకిడికి రెండో అంతస్తు గోడలు కూలిపోయాయి. అగ్ని ప్రమాదం సమాచారం అందడంతో ఘటనా స్థలికి బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఎస్‌ఐలు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది.


బ్రాంటోస్కైలిఫ్ట్‌తో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తెలుగు రాష్ట్రాల సహకార సంస్థలకు నాఫ్స్కాబ్ అవార్డులు

కరీంనగర్ డీసీసీబీకి మొదటి బహుమతి

న్యూఢిల్లీ: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్స్ (నాఫ్స్కాబ్) 60 ఏళ్ల ఉత్సవ వేడుకలు ఢిల్లీలోని భారత్ మండపం సమావేశ మందిరంలో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రఖ్యాత సహకారవేత్తలు కొండూరు రవీందర్‌రావు, భీమా సుబ్రహ్మణ్యం నేతృత్వం వహిస్తున్న ఈ జాతీయ సహకార సంస్థ 60 ఏళ్ల వేడుకలను కేంద్ర హోం, సహకార శాఖమంత్రి అమిత్ షా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉత్తమ సేవలకు గాను నాఫ్స్కాబ్ ఏటా ఇచ్చే అవార్డులను ఈ సందర్భంగా అమిత్


అమిత్ షా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కేడీసీసీబీ పర్సన్ ఇంచార్జ్, జేసీ గీతాంజలి శర్మ, సీఈవో శ్యామ్ మనోహర్

షా ఆయా సంస్థల ప్రతినిధులకు అందజేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మొదటి బహుమతిని పొందగా.. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మూడో బహుమతిని పొందాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ (ఆప్కాబ్) మూడో బహుమతి పొందింది. కరీంనగర్ డీసీసీబీ పొందిన అవార్డును అధ్యక్షుడు రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావుకు అమిత్ షా అందజేశారు. ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి అవార్డు అందుకున్నారు. కేడీసీసీ బ్యాంక్ బహుమతిని పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యామ్ మనోహర్ అవార్డు అందుకున్నారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎస్పీ



అడ్డాకుల: భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌కు ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో సభా స్థలాన్ని మంగళవారం సాయంత్రం ఎస్పీ జానకి పరిశీలించారు. మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు జరగనున్న క్రమంలో మహబూబ్‌నగర్, భూత్పూర్ రహదారిపై ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, శాఖాపరంగా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఆమె వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రామకృష్ణ, శివకుమార్, ఎస్‌ఐ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

జరిమానాకు భయపడి

- రైతు ఆత్మహత్యాయత్నం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

లింగాల: పొలం అంచున ఉన్న చెట్లను నరికి వేయగా పంచాయతీ నుంచి జరిమానా కట్టాలని నోటీసు అందుకున్న రైతు శ్రీకాంత్ రెడ్డి ఆందోళన చెందాడు. పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. మంగళవారం మండలంలోని పద్మనపల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. రోడ్డుకు అనుసరించుకొని మూడేళ్ల క్రితం హరితహారంలో భాగంగా మొక్కలను నాటారు. అవి ఏపుగా పెరుగడంతో వ్యవసాయ పొలానికి అడ్డంకిగా మారాయని భావించిన రైతు 22 చెట్లను ఈ నెల 21 గురువారం నరికేశాడు. ఈ విషయం గమనించిన పంచాయతీ అధికారులు రూ.8 వేలు జరిమానా విధించారు. భయాందోళనకు గురైన రైతు ఈనెల 22న పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై పంచాయతీ కార్యదర్శి భాను చందర్ వివరణ ఇస్తూ నరికిన చెట్లను అధికారులు పరిశీలించి రూ. 8వేలు జరిమానా చెల్లించాలని సూచించడంతో నోటీసు ఇచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఇబ్బందులకు గురి చేసినట్లు రైతు చేస్తున్న ఆరోపణలో నిజం లేదని అన్నారు. చెట్లను నరికి వేసినట్లు కార్యదర్శి ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

న్యుమోనియా నియంత్రణే లక్ష్యం

జిల్లాలో కొనసాగుతున్న సాస్ సర్వే

- ఒక్కో ఆశా కార్యకర్త రోజుకు 40 ఇళ్లు
- చిన్నారుల్లో శ్వాస ఇబ్బందుల గుర్తింపు
- అనుమానితులుంటే జనరల్ ఆస్పత్రికి తరలింపు


సర్వే చేస్తున్న ఆశ కార్యకర్త

పాలమూరు: ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలకు న్యుమోనియా, డయేరియా ప్రధాన కారణాలుగా ఉంటాయి. వీటిని ప్రాథమిక దశలోనే అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలో ఈ నెల 12 నుంచి 2025, ఫిబ్రవరి 28 వరకు వైద్య, ఆరోగ్యశాఖ సాస్ సర్వే చేపడుతోంది. ఇంట్లో ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారా? శ్వాస తీసుకోవడంలో ఏదైనా ఇబ్బంది ఉందా? అంటూ సర్వే చేపడుతోంది.

- జిల్లాలోని 227 మంది ఏఎన్‌ఎంలు, 847 మంది ఆశా కార్యకర్తలు ఇప్పటి వరకు 2,402 ఇళ్లు సర్వే చేశారు. ఇందులో 2,196 మంది కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు 726 మంది చిన్నారులకు సాధారణ జలుబు, దగ్గు ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు న్యూమోనియా సోకినట్లు ఇప్పటి వరకు ఒకరిని కూడా గుర్తించలేదు.

ఆరోగ్య స్థితి మదింపు..

వాస్తవానికి పిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో వ్యాధులు త్వరగా ప్రబలుతాయి. న్యుమోనియా, నియంత్రణే లక్ష్యంగా సాస్ (సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా సక్సెస్‌ఫుల్) కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పిల్లల్లో ప్రాథమిక దశలోనే లక్షణాలు గుర్తించి సకాలంలో చికిత్స అందించడం లక్ష్యం. ఇందులో భాగంగా ఒక్కో ఆశా కార్యకర్త రోజుకు 40 ఇళ్లకు వెళ్లి జ్వరం, జలుబు, దగ్గు, పొడి దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులపై ఆరా తీసి ఆరోగ్య వివరాలు సేకరిస్తారు. తీవ్రతను బట్టి పీహెచ్‌సీ, జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. అక్కడ అవసరమైన చికిత్స అందించి వ్యాధిని నియంత్రిస్తారు. ఇదే సమయంలో న్యూమోనియా నివారణకు ఇచ్చే టీకాలు పొందారా? లేదా? అనే విషయాన్ని సైతం ఆరా తీస్తున్నారు.

ఎలా సోకుతుంది..

న్యుమోనియా బ్యాక్టీరియా లేదా వైరస్ కారణంగా ఊపిరితిత్తులకు సంక్రమించే వ్యాధి. ఊపిరితిత్తుల్లోని గాలి సంచులు చీము ద్రవాలతో నిండిపోతాయి. గాలి గదుల్లోకి బ్యాక్టీరియా లేదా వైరస్‌తో నిండిన ద్రవ పదార్థం చేరడంతో శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఇది సోకితే మరణాలకు కూడా దారి తీసే ప్రమాదం ఉంది. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల్లో 15 శాతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

వ్యాధి లక్షణాలు..

వ్యాధి సోకిన వారిలో దగ్గు, రక్తంతో కూడిన కఫం, చలి జ్వరం, శ్వాసకోశాలు, ఛాతిభాగంలో నొప్పి, తలనొప్పి, ఆక్సిజన్‌స్థాయిల్లో హెచ్చు తగ్గులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో వికారం, వాంతులు, విరేచనాలు కూడా కలుగుతాయి. ప్రారంభ దశలో గుర్తిస్తే సరైన చికిత్స ద్వారా అరికట్టడానికి వీలు ఉంటుంది.

నియంత్రణ ఇలా..

- ఆరు నెలల వరకు తల్లిపాలు తీసుకోవడం
- సరైన సమయాల్లో వ్యాక్సినేషన్
- పోషకాహార లోపాన్ని నియంత్రించడం
- పొగకు దూరంగా ఉండటం..

రద్దీ ప్రదేశాలకు వెళ్లకుండా చూసుకోవాలి

సాస్ సర్వే కొనసాగుతుంది.

వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి సరైన చికిత్స అందించేందుకు సాస్ సర్వే నిర్వహిస్తున్నాం. వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించాం. దగ్గు, జ్వరం, శ్వాసలో ఇబ్బందులు ఉంటే సిబ్బందికి చెప్పాలి. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం ఏర్పడుతుంది. ముఖ్యంగా పిల్లలు, 60 ఏళ్ల దాటిన వారికి ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంటుంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది.

– డా. పద్మజ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్ అన్నారు. ఆల్‌ట్రేడ్ యూనియనస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో కార్మికులు, రైతులు, కర్షకులతో కలిసి సమ్మె నిర్వహించారు. మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన నిరసనలో కార్మికులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లక్ష్మయ్య, నర్సింలు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు సురేశ్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రాములు, రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాంచందర్, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.పద్మతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలతో దేశ ప్రజలు, రైతులు, కార్మికులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు హయ్యర్ పెన్షన్ చెల్లించాలని, మల్టీ నేషనల్ కంపెనీల లాభాల కోసం తీసుకొస్తున్న విధానాలు రాజ్యాంగంలోని ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధమన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కడియాల మోహన్, జగన్, చంద్రకాంత్, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, సాంబశివుడు, అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య, గోపాల్ నాయక్, విశ్వనాథం, చంద్రన్న పాల్గొన్నారు.


కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

రాష్ట్రస్థాయి టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి

- జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్–17 విభాగం బాల, బాలికల సాఫ్ట్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపికలకు దాదాపు 100మందికిపైగా బాల, బాలికలు హాజరైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి టోర్నీల్లో విజేతగా నిలిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. వచ్చేనెల 7 నుంచి 9వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 సాఫ్ట్‌బాల్ టోర్నీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, నిరంజన్‌రావు, ఆనంద్, నాగరాజు, రాఘవేందర్, సుగుణ, నాగమణి, మేరిపుష్ప, కపిల్ పాల్గొన్నారు.

అద్దె కోసం ఎంపీడీఓ కార్యాలయానికి తాళం

- పోలీసులకు ఎంపీడీఓ ఫిర్యాదు
- ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి యజమాని బెదిరింపులు
- ఎంపీడీ హామీతో సద్దుమణిగిన వివాదం


ఎంపీడీఓ శ్రీనివాసులతో వాదిస్తున్న ఇంటి యాజమాని

అమరచింత: అద్దె చెల్లించలేదని మంగళవారం ఎంపీడీఓ ప్రభుత్వ కార్యాలయానికే తాళం పడింది. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయానికి అద్దెకు ఇచ్చిన ఇంటి యజమాని మహంకాళి సురేందర్ అద్దె ఇవ్వడం లేదంటూ తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. తమ కార్యాలయానికి తాళం వేసి విధులకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని ఎంపీడీఓ శ్రీనివాసులు ఇంటి ఓనర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెట్రోల్ బాటిల్ తీసుకొని సురేందర్ ఆత్మహత్య చేసుకుంటాడని బెదిరించాడు. నాలుగేళ్ల నుంచి తనకు ఇంటి అద్దె చెల్లించకుండా వేధిస్తున్నారంటూ ఇంటి ఓనర్ ఆరోపిస్తున్నాడు. కాగా వారం రోజుల క్రితం రూ.1.30లక్షల చెక్కును అందించినట్లు ఎంపీడీఓ చెప్పారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. గ్రామానికి చెందిన పలువురు కలుగజేసుకొని అతడికి న్యాయం చేయాలని అధికారులను కోరారు. డిసెంబర్ 20 నాటికి పూర్తిస్థాయిలో అద్దె చెల్లిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. దీంతో కార్యాలయానికి వేసిన తాళం తెరిచారు.

గతంలో తండ్రి.. ఇప్పుడు కొడుకు

ఎంపీడీఓ కార్యాలయం అద్దె చెల్లింపు విషయంలో గతంలో తండ్రి ఇంటికి తాళం వేయగా ఇప్పుడు కొడుకు అదే సీన్ రిపీట్ చేశాడు. ఎంపీడీఓ కార్యాలయానికి ప్రతీ నెల రూ.15వేల చొప్పున అద్దె చెల్లించడానికి అధికారులు ఇంటి యజమాని మహంకాళి గంగారంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండేళ్ల క్రితం సురేందర్ తండ్రి గంగారం కూడా ఇంటి అద్దె విషయంలో కార్యాలయానికి తాళం వేశారు. అప్పట్లో రెండున్నర లక్షలను విడతలవారీగా అందించారు. గంగారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఏడాదిన్నర తర్వాత ఇంటి అద్దె కోసం ఎంపీడీఓతో గంగారం కొడుకు సురేందర్ మొరపెట్టుకున్నాడు. తమ సమస్యను పట్టించుకోకపోవడంతో కార్యాలయానికి అతడు తాళం వేశాడు.